# అనదలు

"వి. భాస్కర్"

అది భయంకరమైన కాళరాత్రి. ప్రకృతిమాత నిద్రాదేవి ఒడిలో గుజ్జుపెట్టి నిద్రిస్తున్నది. నిశ్శబ్దం తాండవిస్తున్న నిశీథాన్ని చీల్చుకుంటూ ఊరి బయట నున్న జీర్ణ కుటీరంలోనుండి మినుకు మినుకుమంటున్న దీపపుకాంతి తొంగి చూస్తున్నది. కేవలంగా మరణావస్థ ననుభవించేటట్లున్న దీపపు వెలుగు ప్రకృతి నావరించియున్న గభీర నిశీథం ఎంతవరకున్నదో చూడటానికి ప్రయత్నిస్తున్నట్లుంది. కాని బలహీనంగా యున్న ఆ నా నిశీధిని అంతుకనుక్కోలేక నే నిస్పృహతో, నిరాశతో అది వ్వె మినుకు, మినుకు మంటున్నది.

తనకంటే దీనావస్థలో గుడిసె మధ్య ఈతచాపపై శయనించి మరణయాతన ననుభవించు ముప్పైయేళ్ళ స్త్రీమూర్తి విడువలేక ప్రాణాలు బిగబట్టుకొని ఆ కుటీరంలో వెలుగునిస్తున్నదా దివ్వె. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ మధ్యమధ్య "అమ్మా...! అ......య్యో......!" అంటున్న దీనాలాపం కనిపిస్తున్నది. ఆమె తన జీవితంమీద విశ్వాసం లేదని నిర్ణయించుకొనిందేమో? అసహాయ స్థితిలో, బాల్యావస్థ ననుభవిస్తూ, దరిద్రదేవత ఉక్కు కౌగిలలో నలిగిపోతున్న తన బిడ్డల భావి జీవితాల నూహించుకుని లోతుకు దించుకుపోయిన కళ్ళనుండి అశ్రువుల ధారాపాతంగా విడుస్తున్నది.

మినుకు మంటున్న దీపపు వెలుగులో తన బాధను చూడలేక ఏడ్చి, ఏడ్చి తనప్రక్కనే పడి నిద్రిస్తున్న పసిపాపల్ని చూస్తూనే ఆమె బలహీనమైన గుండె నీరైపోయిందా యనిపించింది. తను చనిపోతే బిడ్డలకు దిక్కెవ్వరు? వారు బ్రతకడం ఎలాగా? కష్టాలు అనుభవం లేని పిల్లలు తను మరణిస్తే ఏమౌతారు? ఇల్లిల్లూ అడుక్కు తింటూ చీవాట్లు తినవలసి వస్తుందేమో? వారు పేదతనాన్ని భరించలేక కుళ్ళికుళ్ళి నశించవలసి వస్తుందేమో...? ఆమె హృదయపుటంలో ఈ ప్రశ్నలు తిరిగిపోతున్నాయి. పుట్టెడు రోగాల్తో నెలరోజులనుండీ భరింపరాని బాధ లనుభవిస్తున్నా, వాటికంటే పిల్లల విషయమే ఆమె హృదయాన్ని ఎక్కువగా గాయపరచింది.

తన భర్త చనిపోగానే పిల్లల చంకేసుకొని ఆమె పడిన అగచాట్లన్నీ గుర్తుకొచ్చా యామెకు. "పేదతనం భరింపరానిది. భర్త ఎలాగో కష్టించి భార్యా పిల్లలమైన మమ్మల్ని పోషించేవాడు. కాని ఆయన యాధారం తప్పిన వెనుక, మశూచికం ఆయన్ను పొట్టబెట్టుకొన్న వెనుక మమ్మ మేము పోషించుకోవటానికి ఎన్ని కష్టాలు పడ్డాము. ఎందరు మహా ప్రభువులచేత చీవాట్లు తిన్నాం. ఎందరు మహాతల్లుల పవిత్ర హస్తాల్తో మెడబట్టి గెంటివేయబడ్డాం. అబ్బా! పేదతనంలోని బాధ, అసహ్యం, విరక్తి అగచాట్లు మరేదీ లేదు. ప్రపంచంలో మానవుడు భరింపరానిది పేదతనంతప్ప ఏమీ లేదు.

బిడ్డల్ని పోషించుకోలేక, తిండిలేక మలమల మాడ్తున్న పిల్లలను చూడలేక, వారి ఆర్తనాదాలకు భరించలేక ఒకనాడు ఎలాగైనా ఈ లోకంనుండి విడిపోవాలని నుయ్యివరకూ వెళ్ళటం ఆమెకు గమనమొచ్చింది. ఆనాడు భర్త చనిపోతూ "ఈ దిక్కులేని పిల్లలను దరిద్ర సామ్రాజ్యాన్ని నీచేతిలో విడిచి వెళ్ళిపోతున్నా. ఏంజేస్తావో? వీరి యౌన్నత్యం కోసం ప్రయత్నిస్తావా?" అంటూ దీనంగా, తన కడపటి కోర్కగా అడిగిన భర్త వాక్యాలే గమనం రాకుంటే ఆమె జీవితం అంతటితో నే అంతమయ్యేది. పిల్లలకోసం ఏమైనా చేసి బ్రతకాలనే భర్తయాజ్ఞను తిరస్కరించలేక పోయిందామె.

ఎంతో సహనంతో ఆమె తమ ఆకలిమంటలు తీర్చుకోవటానికి కృషి చేసింది. కాని వారి ఆకలి చల్లార్చలేక పోయిందీ ప్రపంచం.

నిరాధారమై రోజుకో పల్లె తిరుగుతున్న ఆమెకు, పిల్లలకు పొట్ట గడుకుస్నా ఎన్నో ఇబ్బం

గులకు గురికావలసి వచ్చేది. ఆమె శరీర సౌందర్యానికి ముగ్ధులైన వారి బాధను భరించి పొట్టపూడ్చుకోలేకనే ఆనాడామె నువ్యవరకూ వెళ్ళింది. యాచించీ బ్రతుకలేమని నిశ్చయించుకొన్న ఆ సాధ్వి తన్ననుభవించాలని ఆతుర్దాపడే నీచుల్ని గాంచి అసహ్యించుకొనేది. కాని నిస్సహాయమైన ఆమె ఏం చేయగల్గుతుంది ?

తన మానంకంటె ప్రాణం హెచ్చుగాదని భావించే ఆ ఇల్లాలు, తన భర్తను దప్ప ఇతరుల కన్నెత్తిచూడని ఆసాధ్వి తనమానం కాపాడుకోవటానికి ఎన్నో చిక్కులు పడింది. కడకు తన భర్త యాజ్ఞకంటె, తన పిల్లల ఆర్తనాదాలకంటె తన మానం ఎక్కువ గాదనుకొంది. తన్ను కాంక్షించే నీచులకు తన శరీరాన్ని ఒప్పించి తమ దుర్భర దారిద్ర్యాన్ని పోగొట్టుకోవటం అసమంజస మనిపించలేదామెకు.

ఎన్నోరోజులు యోచించి తన పసిపాపల్ని కాపాడి, వారిని ఉన్నత దశలోనికి గొనిరావటమే శ్రేయోదాయకమని నిర్ణయించుకొంది. తన అందానికి దాసులై తన చుట్టూ తిరిగే వారికందరికీ గమ్యస్థానంగా ఊరి వెలుపలనున్న ఆ చిన్న పాకనే రాగో నిర్మించుకొంది.

నాటినుండీ ఆమె మనస్సులో తీరని బాధ ననుభవిస్తున్నా తన పిల్లలు భర్త యాశయం మేరకు ఉన్నతదశకొస్తారని సంతృప్తిపడేది. తమ పోషణకై మిగిలేట్లు డబ్బులు వస్తున్నాయి. నాలుగేళ్ళ అమ్మాయినీ రెండేళ్ళ పిల్లాడినీ పోషించటం ఆమెకిప్పుడు చాలా తేలికగా ఉంది.

కాని ఆమెకు ఏడాదికే లెక్కలేనన్ని వ్యాధులు వచ్చాయి. పుట్టెడు వ్యాధులలో మునిగి తేలింది. తన పిల్లలు పెద్దవారు కాకముందే తన భర్త ఆశయం నెరవేరకముందే ఆమె మంచం పట్టింది. భయంకరమైన రోగాలు ఆమెను నలిపివేశాయి. ఆమె పాడుగుడిసెను చూచేవారు గూడా లేరు. చేతనున్న పదికాసులు రోగాలు నయం చేసుకోవాలని వెచ్చించింది. ప్రయోజనము శూన్యమై [illegible] చావుబ్రతుకుల్లో పడింది.

ఇక తాను మరణిస్తే బిడ్డలెలాగా జీవించగలరనే సమస్య ఆమెకు ఎక్కువైంది. బిడ్డలకోసం తాను తన జీవితంలో చేయరాని పాపపు తలంపులకు గూడా తలయొగ్గింది. కాని బిడ్డల్ని ఉన్నత దశకు తీసుకరావటానికి తన జీవితం నిలువలేక పోతున్నది. పిల్లల్ని విడువటానికి మనస్కరించక, వారిపైనున్న ఆశతోనే ఆమె ఇన్ని రోజులూ బ్రతుకకలిగింది.

ఆరాత్రి గడవటం ఆమెకు దుర్ఘటంగా ఉంది. అసలు ఇంకొక గంటసేపైనా నిలువగలనా యన్న సందేహం ఎక్కువైంది. బాధ మితిమీరి పోతున్నది. యమయాతన ననుభవిస్తున్న ఆ యనాదను ఎవరు చూస్తారు ?

మినుక్కు మంటున్న దీపం నిస్సహాయమైన ఆమెను విడువలేక తిన్నగా తన జీవితాన్ని చాలించింది. చీకట్లు క్రమ్ముతున్న ఆమె కళ్ళకు కాస్త వెలుగు గూడా తప్పింది. ప్రక్కనున్న పిల్లల్ని భయంతో తడవిచూచింది. వారు అలసి, సొలసి దీర్ఘంగా నిద్రిస్తున్నారు. ఆమె హృదయం శోకంతో క్రుంగిపోయింది. ఏదో పెద్ద బరువైన వస్తువు గుండెలమీద పెట్టినట్లయింది. కడసారిగా బిడ్డల్ని స్పృశించి కన్నుమూసింది. ఆమె తన జీవయాత్ర చాలించింది. ఆమె జీవిత నాటకంలో కడపటి తెర జారిపోయింది.

తెల్లవారకముందే నిద్రమేల్కొన్న పిల్లలు తమ తల్లి నిద్రిస్తున్నదేమోనని, తమ మాతృదేవతకు బాధ తగ్గిపోయిందేమోనని పలుకరించారు. ఎంతసేపు అరచినా ఆమె పలుకదు. ఎంత కదిలించినా దీర్ఘ నిద్రనుండి ఆమె మేల్కొనదు.

పాపం దిక్కు, తెన్ను తెలియని అమాయకులైన బిడ్డలు ఆమెను పలుకరించి విసిగిపోయారు. మాతృదేవత నిరాదరణతోపాటు వారి చిన్న బొజ్జల్లోని జఠరాగ్ని వారిని ఏడ్పించింది. రాళ్ళు ద్రవించేట్లు, మిన్ను విరిగిపోయేట్లు అనాధలైన ఆ పిల్లలు ఏడుస్తూనే యున్నారు.